క్లుప్తంగా

కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్

అచ్చంపేట రూరల్: అచ్చంపేట మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్యాం సుందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కోఆప్షన్ సభ్యుల ఎన్నిక నామినేషన్ స్వీకరిస్తామని తెలిపారు. ఇద్దరు సభ్యులలో ఒకరు మహిళ ఉంటారని పేర్కొన్నారు. ఈ నెల 8 నుంచి 14వ తేదీ సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ స్వీకరిస్తామని తెలిపారు.

విరాళాల సేకరణ



అచ్చంపేట రూరల్: కేరళ వయనాడ్ వరద బాధితుల కోసం బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని దుకాణాలు, బాటసారుల నుంచి విరాళాలు సేకరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దేశ్యానాయక్, మల్లేష్, సయ్యద్, శివకుమార్, మల్లికార్జున్, హరి, సంతోష్, కార్తీక్, నిర్మల, పార్వతమ్మ, శివలీల, రజిత, జ్యోతి పాల్గొన్నారు.

తాడూరు: కేరళలోని వయనాడు ప్రాంతంలో ప్రకృతి బీభత్సానికి కొండచరియలు విరిగిపడి సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు కేవీపీఎస్ ఆధ్వర్యంలో విరాళాల సేకరణను తహసీల్దార్ ప్రమీలతో కలిసి ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కాశన్న ప్రారంభించాడు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో విరాళాలు సేకరించారు. నాయకులు లక్ష్మయ్య, రాములు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలకం



తాడూరు: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులే కీలకమని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శిర్సవాడ కాంప్లెక్స్ ఆవరణలో హెచ్‌ఎం రమేష్ అధ్యక్షతన బదిలీ అయిన 23 ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు, పదవి విరమణ సర్వసాధారణమన్నారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాసరాఘవేందర్, రాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల పెంపకం




పెద్దకొత్తపల్లి: మండలంలోని ఉన్నత పాఠశాలలో స్కూల్ హెల్త్ క్లబ్ యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంలో భాగంగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఔషధ మొక్కలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఔషధ మొక్కల ప్రాధాన్యత గురించి ప్రోగ్రాం ఆఫీసర్ విశ్వేశ్వర్‌రావు విద్యార్థులకు వివరించారు. ఔషధ మొక్కలను ఒక్కొక్క మొక్కను ఒక్కొక్క విద్యార్థి దత్తత తీసుకుని పెంచాలని హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో హెల్త్ క్లబ్ మెంబర్ నందీశ్వర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రవి, సీఆర్‌పీలు రమేశ్‌రెడ్డి, ఈశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ

లింగాల: మండలంలోని అప్పాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంట గది పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలైన్‌మెంట్ పనుల పరిశీలన



చారకొండ: మండలంలోని జూపల్లిలో కెఎల్ఐ ఉప కాల్వ పనులు చేపట్టాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి రెండు రోజుల కిందట స్థానిక నాయకులు నకినమోని వెంకటయ్య యాదవ్, గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఈ మేరకు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ బుధవారం జూపల్లి శివారులో ఉప కాల్వ పనులు ప్రారంభించే అలైన్‌మెంట్‌ను కేఎల్ఐ ఏఈ రమేష్ పరిశీలించారు. త్వరలో పనులు ప్రారంభించి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని అన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం

నాగర్‌కర్నూల్: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సునీంద్ర, నిజాం, కావలి శ్రీను, పద్మమ్మ, వైస్ ఎంపీపీ నిర్మల, మండల మహిళా అధ్యక్షురాలు భార్గవి, మాజీ ఎంపీటీసీ రమణారావు పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబాన్ని ఆదుకుంటాం

నాగర్‌కర్నూల్‌రూరల్: తిమ్మాజిపేట మండలానికి చెందిన జర్నలిస్టు కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని గుమ్మకొండ గ్రామానికి చెందిన రిపోర్టర్ రాజశేఖర్ ఇటీవల అనారోగ్య సమస్యతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాజేశ్‌రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి రాజశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. నాయకులు చిలుకా వివేక్‌రెడ్డి, శ్రీనివాస్ బహద్దూర్, దానం బాలరాజు, మాధవులు, రవూఫ్, దేవస్వామి, లక్ష్మీనారాయణ, వరుణ్ కుమార్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా తిమ్మాజిపేట మండలం గుమ్మకొండలో మృతి చెందిన రాజు, జహంగీర్ కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిద్దాం

సాక్షి, నెట్‌వర్క్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిద్దామని అచ్చంపేట్ ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. చారకొండ మండల కేంద్రంలో బుధవారం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో ప్రత్యేక అధికారి ఇసాక్ హుస్సేన్‌తో కలిసి మొక్కలను నాటారు. ప్రధాన రహదారి వెంట విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్‌లో ఎమ్మెల్యే మట్లాడుతూ గ్రామాలను స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దుతామన్నారు. తెలకపల్లి మండలంలోని పెద్దపల్లి, గౌతంపల్లి, గట్టురాయిపాకుల, అనంతసాగర్, బండపల్లి, దాసుపల్లిలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. గౌరారంలో పాఠశాల, ఆరోగ్య ఉపకేంద్రంలో మొక్కలు నాటారు. దోమలపెంటలో ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ కార్యదర్శి శరత్‌కుమార్ హాజరయ్యారు. తాడూరు మండలంలోని అల్లాపూర్‌లో ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి వీధులను పరిశీలించారు. వెల్దండ మండలంలోని కొట్ర గ్రామంలో మండల ప్రత్యేక అధికారి ఖజా నిజామ్ అలీ అధికారుల బృందం పర్యటించారు. లింగాల మండల కేంద్రంతో పాటు అప్పాయపల్లి, మల్లొనిచెర్వుతండాలో పలు అంశాలపై ఎంపీడీఓ ఆంజనేయులు అవగాహన కల్పించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, మాజీ జెడ్పీటీసీలు వెంకట్ గౌడ్, బీముడు మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గుర్వయ్య గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటయ్య యాదవ్, కార్యదర్శి మహేందర్, అధికారులు, నాయకులు తదితరులు ఉన్నారు.



చారకొండలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

న్యాయవాదుల నిరసన



నాగర్‌కర్నూల్ క్రైం: జనగామ పోలీస్‌స్టేషన్ పరిధిలో న్యాయవాద దంపతులపై పోలీసుల దాడిని ఖండిస్తూ బుధవారం జిల్లా కోర్టు న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ మాట్లాడుతూ న్యాయవాదులు గద్దల అమృతరావు, కవితలపై దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. సీఐ, ఎస్ఐలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సెక్రెటరీ ఏ. పర్వత రెడ్డి, బండారు రాజశేఖర్, బ్రహ్మేశ్వర రావు, బాబు పియర్స్, శ్యాంప్రసాద్‌రావు, పాల్గొన్నారు.

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయవాదులు విధులను బహిష్కరించారు. బుధవారం కోర్టు ప్రధాన ద్వారం ముందు న్యాయవాదులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కర్నె శ్రీహరి, న్యాయవాదులు శ్రీనివాసరావు, భాస్కర్‌రెడ్డి, వసంతరెడ్డి, ఉపేందర్, గోవిందు, రాజేష్, రాఘవేంద్ర, నళిని తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలి



కొల్లాపూర్: మున్సిపాలిటీల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో మున్సిపల్ కార్మికులతో ఆయన సమావేశం అయ్యారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మారెడు శివశంకర్‌లు, ఎండీ యూసూఫ్, బాపనిపల్లి నాగయ్య పాల్గొన్నారు.

బీమా చేసుకొని ధీమాగా ఉండాలి

వెల్దండ: మండలంలోని లింగారెడ్డిపల్లిలో పోస్టాఫీసులోని బీమా పథకాలపై షాద్‌నగర్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం లింగారెడ్డిపల్లిలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగాంలో భాగంగా తపాలాశాఖ అందిస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది కుమార్, వెంకటేశం, తదితరులు ఉన్నారు.

చెక్కుల పంపిణీ

పెద్దకొత్తపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎంపీడీఓ నాగేంద్రం, ఆర్ఐ వెంకటేష్, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్‌లు బుధవారం రాత్రి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, లక్ష్మణ్, కృష్ణయ్య, లక్ష్మణ్‌రావు, చంద్రయ్య, రాజు, శివకుమార్‌రావు, బాలస్వామి, నర్సింహా, రవికుమార్, శశికళ, కొండలయ్యలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు పరామర్శ

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉప్పునుంతల మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ శారదను బుధవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు పరామర్శించారు. అంగన్‌వాడీ టీచర్లపై రాజకీయ కక్ష వేధింపుల చర్యలకు పాల్పడటం మానుకోవాలన్నారు. సీపీఎం నాయకులు అశోక్, కందికొండ గీత తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ: ఒకరికి తీవ్రగాయాలు

వెల్దండ: మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం వంగూర్ మండలం మాచినోనిపల్లి గ్రామానికి చెందిన శివ ద్విచక్రవాహనంపై ఆమనగల్లుకు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న శివ తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

నలుగురిపై కేసు నమోదు

లింగాల: మండలంలోని కొత్తకుంటపల్లికి చెందిన వెంకటమ్మపై గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేసిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాల ప్రకారం వెంకటమ్మ ఇంటి సమీపంలో ఓ ఫంక్షన్ నిర్వహిస్తున్నారు. ఫంక్షన్‌లో చిన్నపాటి గొడవ కారణంగా మహిళ వెంకటమ్మపై నలుగురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బుధవారం బాధితురాలు ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

నాగర్‌కర్నూల్‌రూరల్: తిమ్మాజిపేట మండలంలోని రాళ్లచెరువు తండాలో రైతు బాషాకు సంబంధించిన ఎద్దు బుధవారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. ఎద్దు విలువ రూ.60 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

లేగ దూడను చంపిన తోడేలు

నాగర్‌కర్నూల్: గంగారం అటవీ సరిహద్దు ప్రాంతంలోని వసురాంతండాలో మంగళవారం రాత్రి లేగదుడను తోడేలు చంపిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం రైతు రాత్లావత్ మన్యంకు సంబంధించిన ఆవుతోపాటు దూడలను పొలం వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా సమీపంలో లేగ దూడ మృతిచెంది కనిపించింది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దేవరాజ్, సెక్షన్ ఆఫీసర్ చంటి, బీట్ ఆఫీసర్ మోహన్‌లు ఘటన స్థలానికి చేరుకొని లేగదూడను తోడేలు చంపితిందని నిర్ధారించారు. బాధిత రైతుకు నష్టపరిహారం అందే విధంగా చూస్తామని అధికారులు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఫొటోగ్రాఫర్ రాఘవేందర్ సతీమణి జ్యోత్స్న కొన్ని రోజుల కిందట మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఫొటో, వీడియో వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు నేతాజీగౌడ్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అచ్చంపేట ఫొటో, వీడియో గ్రాఫర్లు రూ. 40వేలు, నాగర్‌కర్నూల్ నుంచి రూ. 10వేలు సమకూర్చారు. ఈ మేరకు వారు బాధిత కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందించారు. రాఘవులు, నారాయణగౌడ్, షరీఫ్, షకీల్, వీరేందర్, శేఖర్, కృష్ణ, అఖిల్, రామస్వామి, శివకుమార్ పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన

కొల్లాపూర్/లింగాల: కొల్లాపూర్‌లోని గాయత్రీ జూనియర్ కళాశాల, లింగాల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ, గోపాల్ ప్రిన్సిపాల్ బాలస్వామి, పీడీ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ శ్రీనివాస్, ఎస్ఐ జగన్‌మోహన్ పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో ఈ నెల 9న వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ జిల్లెల్ల వెంకట్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ నేరాలలో స్వాధీనం చేసుకున్న వాహనాలు వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు.

బోనాల మహోత్సవం..

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల బంగారు మైసమ్మతల్లి దేవస్థాన ఆవరణలో ఈ నెల 9న బోనాల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ పుల్లారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు

పెంట్లవెల్లి: మండలంలోని కేజీబీవీ పాఠశాలను ఇటీవల సందర్శించిన కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు తాగునీటి సమస్య ఉందని విద్యార్థినులు విన్నవించారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వేతనాలు చెల్లించాలి

పెంట్లవెల్లి: పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటస్వామికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో చిట్టెమ్మ, చందు, అమ్ములమ్మ, చెన్నమ్మ, పద్మ, నర్సింహ, కుర్మయ్యలు పాల్గొన్నారు.

టై, బెల్ట్‌లు వితరణ



కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగుల పాఠశాల విద్యార్థులకు ముకురాల గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ కొప్పుల జయవర్ధన్‌రెడ్డి సమకూర్చిన టై, బెల్ట్‌లను బుధవారం పంజుగుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్లయ్య గౌడ్ టై, బెల్టులు, బ్యాడ్జీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గణేశ్, షబ్బీర్, పుష్పావతి, ఉమాదేవీ తదితరులు పాల్గొన్నారు.

భారీ విద్యుత్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ తరలింపు



కోడేరు: మండలంలోని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లో భాగంగా తీగలపల్లిలో 13, 535 టన్నుల పవర్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చేందుకు 1800 వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న భోపాల్ నుంచి తీసుకొచ్చారు. 65 టైర్ల భారీ వాహనంపై పవర్ ట్రాన్స్‌ఫార్మర్ తీసుకొస్తుండగా ప్రయాణికులు ఆసక్తిగా గమనించారు. ఇటీవల రెండు రోజుల నుంచి వర్షాలు కురవడంతో రోడ్లు దెబ్బతినడంతో తీగలపల్లి సమీపంలో వాహనాన్ని నిలిపివేశారు. దీంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు వాహనం దగ్గర సెల్ఫీలు దిగారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



కోడేరు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి సుధాకర్‌సింగ్ నిర్వాహకులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో మోడల్ స్కూల్, బాలికల హాస్టళ్లలో మధ్యాహ్న భోజన్నాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ శ్రవణ్‌కుమార్ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్ఐలు సురేందర్, జంబులయ్య, ప్రిన్సిపాల్ ఉమఅస్త పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య శిబిరం

చారకొండ: నేషనల్ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో వయో వృద్ధులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బుధవారం మండలం కేంద్రంలో ఆయుర్వేద్ వైద్యశాలలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేష్ హాజరై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. మొత్తం 100 మందికి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ గాయత్రి, రేణుక, ఫార్మసిస్టు నర్మద, బీచ్యా తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయికి డీఏవీ విద్యార్థుల ఎంపిక

దోమలపెంట: టీఎస్ జెన్‌కో ఆధ్వర్యంలో హన్మకొండ కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్‌లో నిర్వహించిన క్లస్టర్ లెవెల్ క్రీడల్లో ఈగలపెంట డీఏవీ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జె.ప్రసాద్ తెలిపారు. బుధవారం ఈగలపెంటలోని డీఏవీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి భూగర్భ కేంద్రం సీఈ సూర్యనారాయణ, ఎస్ఈలు రవీంద్రకుమార్, ఆదినారాయణ పాల్గొని విద్యార్థులను, పీఈటీ జానయ్యను అభినందించారు. అండర్ 14 విభాగంలో హైజంప్, లాంగ్‌జంప్‌లో కె.హర్షసుల్తానా, పి.లక్ష్మణ్ ప్రథమస్థానం, టి.అరుణ ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్ 17 విభాగం వాలీబాల్‌లో అలేఖ్య, సంకీర్తన, ప్రవచన, రామశిరీష, సంకల్పన, శ్రీచందన ద్వితీయస్థానంలో నిలిచినట్లు పీఈటీ తెలిపారు. ఈ నెల చివరి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని వివరించారు.



విద్యార్థులతో భూగర్భ కేంద్రం సీఈ, ఎస్ఈలు

అసత్యపు ఆరోపణలు సరికావు

ఉప్పునుంతల: మండలంలోని లక్ష్మాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితోనే ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ టీచర్ శారదకు మెమోలు ఇచ్చారనే ఆరోపణలు సరికావని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్‌కు విధి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ఐసీడీఎస్ అధికారులు మెమోలు ఇస్తే కాంగ్రెస్ పార్టీకి సంబంధం ఎందుకుంటుందని ప్రశ్నించారు. అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు రాజకీయంగా వాడుకోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. పార్టీ ఉనికి కోసమే నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాడని తెలిపారు. అసత్య ఆరోపణలు చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, భాస్కర్, తిర్పతయ్యగౌడ్, శ్రీనివాసులు, శేఖర్‌గౌడ్ రామచంద్రయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా విద్యార్థుల నోట్‌బుక్స్ విక్రయాలు

బల్మూర్: వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రభుత్వ సరఫరా చేసిన నోట్‌బుక్స్‌లను కిరాణా దుకాణాల్లో అక్రమంగా విక్రయిస్తున్నారని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చింత శివకుమార్ ఆరోపించారు. మండలంలోని కొండనాగులలో బుధవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో కిరాణ దుకాణాలను పరిశీలించగా వసతి గృహాల విద్యార్థులకు సంబంధించిన నోట్‌బుక్‌లు లభ్యం అయ్యాయి. దీంతో అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొల్లాపూర్‌లో ముసురు

కొల్లాపూర్: పట్టణంలో రెండు రోజులుగా ముసురు వర్షాలు కురుస్తున్నారు. మంగళవారం సాయంకాలం నుంచి రాత్రి వరకు 21.2 మి.మీ వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మళ్లీ ముసురు వాన పట్టింది. వర్షం కారణంగా పలు చోట్ల రోడ్లపై నీళ్లు నిలిచాయి.

వర్షానికి కూలిన ఇంటి పైకప్పు



పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని మూడో వార్డులో నివసిస్తున్న జల్లు వెంకటరమణకు సంబంధించిన ఇల్లు మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పైకప్పు కూలింది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరు లేక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వ ఆదుకొని ఇల్లు నిర్మించాలని బాధితులు వెంకటరమణ, భార్య వరలక్ష్మిలు విజ్ఞప్తి చేశారు.

ఇల్లు కూలిన బాధితులకు సాయం

నాగర్‌కర్నూల్‌రూరల్: బిజినేపల్లి మండలం వడ్డేమాన్‌లో వర్షం కారణంగా ఎండీ సుల్తానా ఇల్లు కూలింది. ఈ మేరకు గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి, రేషన్ డీలర్ రాజేశ్‌కుమార్‌లు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. శంకర్, గొల్ల చిన్నయ్య, రఫీ, ముస్తాఫ పాల్గొన్నారు.

తల్లిపాలతో రోగ నిరోధక శక్తి

కల్వకుర్తి టౌన్: తల్లిపాలతో శిశువు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శివరాం పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాలపై బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఆస్పత్రి వైద్యులు రాములు, యశోద, అన్నపూర్ణ, వసంత, సుష్మ, పాండురంగ, షకీల్, ఉదయ్, విష్ణు, విజయ్‌కుమార్ , స్వప్న,తదితరులు ఉన్నారు.



కల్వకుర్తిలో మాట్లాడుతున్న శివరాం

తెలకపల్లి: పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి భాస్కర్, ఏపీఎం నిరంజన్, అంగన్‌వాడీ కార్యకర్తలు అక్బరీ, చంద్రకళ, లక్ష్మి, రామచంద్రమ్మ, రాధ, తల్లులు మమత, రజిత, మాధవి, చాందుబీ, భాగ్య, శివలీల, నాగలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని అవుసలికుంటలో అంగన్‌వాడీ విద్యార్థులు, తల్లులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ ఉమ పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరంలో 1వ అంగన్‌వాడీ సెంటర్ టీచర్ రామచంద్రమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.